ఉపాధి పనులను వినియోగించుకోవాలి : డీఆర్డీవో

బుధరావుపేటలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న డీఆర్డీవో

ఖానాపురం, ఏప్రిల్ 25: ఉపాధిహామీ పనులను కూలీలు వినియోగించుకోవాలని డీఆర్డీవో కౌసల్యదేవి అన్నారు. గురువారం ఆమె బుధరావుపేటలోని చెరువులో జరుగుతున్న పూడికతీత పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఈజీఎస్ సిబ్బందితో సమీక్షించారు. బుధరావుపేటలో 421 మంది కూలీలు పని చేస్తుండడంపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. ఎంపీడీవో భారతి, ఏపీవో సునీత, కార్యదర్శులు పాల్గొన్నారు.

కొలతలు సరిగా ఉండాలి

నెక్కొండ: పిల్లలకు స్కూల్ యూనిఫాంను సరైన కొలతలతో కుట్టాలని డీఆర్డీవో కౌసల్యాదేవి సూచించారు. నెక్కొండలో భారతి మండల సమాఖ్య కార్యాలయంలో స్కూల్ యూనిఫాం కుట్టేందుకు వచ్చిన సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. క్లాత్ కటింగ్‌పై శిక్షణ పొందాలన్నారు. ఏడీఆర్డీవో రేణుకాదేవి, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, డీపీఎం భవాని, ఏపీఎం శ్రీనివాస్, ఏపీ వో జాకబ్, సమాఖ్యసభ్యులు పాల్గొన్నారు.

మలేరియా నియంత్రణలో భాగస్వాములవ్వాలి

గిర్మాజీపేట/ఖానాపురం, ఏప్రిల్ 25: మలేరియా నియంత్రణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని డీఎంహెచ్‌వో కాజీపేట వెంకటరమణ సూచించారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా బుధవారం తన కార్యాలయంలో వైద్య సిబ్బందికి కీటకజనిత వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. మలేరియా నియంత్రణలో భాగంగా వైద్య సిబ్బంది ఇంటింటా సర్వే చేపట్టాలన్నారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో యాంటీ లార్వల్ ఆపరేషన్ చేపట్టాలన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాలు, పట్టణాల్లో ప్రతి మంగళవారం డ్రైడే పాటించాలని పిలుపునిచ్చారు. సదస్సులో వైద్యాధికారులు కిరణ్, యశస్విని, ఇన్‌చార్జి అసిస్టెంట్ మలేరియా అధికారి మాడిశెట్టి శ్రీనివాస్, విజయేంద్ర కుమార్, పాలకుర్తి సదానందం, మధుకర్, రాజశేఖర్, చక్రపాణి, కుమారస్వామి, పట్టణ ఆరోగ్యకేంద్రం సిబ్బంది, ఆశ కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. ఖానాపురం పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల వైద్యాధికారి జ్యోతి, వైద్య సిబ్బంది భాస్కర్, రాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

గిర్మాజీపేట: మాట్లాడుతున్న వెంకటరమణ

మలేరియాను నిర్మూలిద్దాం : డీఎంహెచ్‌వో సాంబశివరావు

వరంగల్: మలేరియా నియంత్రణ కోసం సమష్టిగా పోరాటం చేద్దామని డీఎంహెచ్‌వో సాంబశివరావు పిలుపునిచ్చారు. గురువారం మలేరియా దినోత్సవం సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2023లో జిల్లాలో 12 కేసులు నమోదు అయ్యాయని, 2024లో ఒక్క మలేరియా కేసు నమోదు కాలేదన్నారు. గ్రామాల్లో పాజిటివ్ కేసులు వస్తే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో చికిత్స అందించాలన్నారు. మే 10 వరకు ఎస్టిమేటివ్ సర్వే పూర్తి చేయాలన్నారు. జిల్లా ఇన్‌చార్జి ఇమ్యూనైజేషన్ అధికారి ఇష్తికార్ అహ్మద్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి చంద్రకళ, స్టాటిస్టికల్ అధికారి ప్రసన్నకుమార్ తదితరులున్నారు.

ధాన్యం కొనుగోళ్ల లో వేగం పెంచాలి

రాయపర్తి, ఏప్రిల్ 25: యాసంగి ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి సూచించారు. మండలంలోని మైలారం, రాయపర్తి, రాగన్నగూడెంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె పరిశీలించి నిర్వాహకులకు సూచనలు చేశారు. అనంతరం రాగన్నగూడెం శివారులోని గణేశ్‌కుంటలో ఉపాధి హామీ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు.

పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు

పూజలు చేస్తున్న సంఘం నాయకులు

హసన్‌పర్తి, ఏప్రిల్ 25: నాగారంలో పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా గురువారం హోమాలు, పూజలు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠాపనకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేలు కేఆర్ నాగరాజు, కడియం శ్రీహరి, మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, దాస్యం వినయ్‌భాస్కర్, మల్లేశం, డాక్టర్ విజయ్‌కుమార్, చంద్రశేఖర్ హాజరు కానున్నట్లు మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు డీ రాజు తెలిపారు. సంఘం సభ్యులు మల్లయ్య, నర్సయ్య, గుణశేఖర్, కుమార్, ఐలయ్య, సృజన్, సమ్మయ్య, రఘుపతి, భిక్షపతి పాల్గొన్నారు.

6 నుంచి కేయూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 25 : కేయూ డిగ్రీ రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ టైం టేబుల్‌ను పరీక్షల నియంత్రణాధికారి నరసింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి తిరుమలాదేవి విడుదల చేశారు. రెండో సెమిస్టర్ మే నెల 6వ తేదీన, నాలుగో సెమిస్టర్ పరీక్షలు మే 7న, ఆరో సెమిస్టర్ పరీక్షలు మే 6న జరుగుతాయని తెలిపారు. అలాగే పీడీసీ మొదటి, రెండో సంవత్సరం (తెలుగు) టైం టేబుల్‌ను విడుదల చేశారు. మొదటి సంవత్సరం పరీక్షలు మే 8న, రెండో సంవత్సరం పరీక్షలు మే 15న జరుగుతాయని తెలిపారు. వివరాలకు www.kakatiya.ac.in లో సంప్రదించాలని వెల్లడించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

బిజినెస్ ఆఫర్

★స్త్రీ/పు అవకాశం తక్కువ పెట్టుబడితో 25 రకాల వెజ్-నాన్ వెజ్ పచ్చళ్ళు షాపుని మీ ఏరియాలో స్థాపించి నెలకు 30 వేలు ఆపైన ఆదాయం పొందండి. సెల్: 8143909459.
NTW-323248

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

నిజాయితీ చాటుకున్న ఆటోడ్రైవర్

సుబేదారి/గిర్మాజీపేట, ఏప్రిల్ 25: తన ఆటోలో ప్రయాణికురాలు మర్చిపోయిన నగదు, నగలు ఉన్న బ్యాగును అందించి ఆటో డ్రైవర్ నిజాయితీ చాటుకున్నాడు. షాపింగ్ కోసం శ్రావణి హనుమకొండ చౌరస్తాలో మహ్మద్ అజీమ్‌కు చెందిన ఆటోలో ఎక్కి వరంగల్ చౌరస్తాలో దిగిపోయింది. ఈ క్రమంలో తన బ్యాగును ఆటోలో మరిచిపోయింది. అనంతరం బాధితురాలు ఇంతెజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లితన బ్యాగులో నాలుగు తులాల బంగారు నక్లెస్, రూ. 40 వేల నగదు ఉన్నట్లు విలపించింది. అయితే, ఆటోడ్రైవర్ అజీమ్ తన ఆటోలో శ్రావణి మరిచిపోయిన బ్యాగును గుర్తించి పోలీసులకు అప్పగించాడు. ఈ సందర్భంగా అజీమ్‌ను సీఐ శివకుమార్ అభినందించి బ్యాగును ఆమెకు అప్పగించారు. అలాగే, గూడూరు రజిత కంగన్‌హాల్‌లో రూ.15 వేల విలువైన సెల్‌ఫోన్ మర్చిపోగా రజినీకాంత్‌కు దొరికింది. ఇంతెజార్‌గంజ్ పోలీసులకు అప్పగించాడు. ఆమెనుస్టేషన్‌కు పిలిపించి మొబైల్‌ను అప్పగించారు.

బాధితురాలికి బ్యాగు అందజేస్తున్న ఆటోడ్రైవర్ అజీమ్

గెలుపే లక్ష్యంగా పని చేయాలి : ఎర్రబెల్లి

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

ఐనవోలు, ఏప్రిల్ 25: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని మాజీ మంత్రి, ఐనవోలు, వర్ధన్నపేట, పర్వతగిరి మండలాల ఇన్‌చార్జి ఎర్రబెల్లి దయాకర్‌రావు సూచించారు. కొండపర్తిలో కొండపర్తి, వనమాలకనపర్తి, నర్సింహులగూడెం, ముల్కలగూడెం బూత్‌స్థాయి స్థాయి కార్యకర్తలు, నాయకులతో గురువారం ఆయన సమీక్షించారు. హనుమకొండ జడ్పీ చైర్మన్ డాక్టర్ మారేపల్లి సుధీర్‌కుమార్ 2001 నుంచి కేసీఆర్ వెంటే ఉంటున్నారని గుర్తుచేశారు. కరీంనగర్ జడ్పీ వైస్ చైర్మన్‌గా ఆయన సేవలందించారని తెలిపారు. సుధీర్‌కుమార్ పార్టీకి చేసిన సేవలను గుర్తించి జడ్పీ చైర్మన్‌గా అవకాశం ఇచ్చారన్నారు. ఆయన గెలుపునకు ప్రతి గ్రామంలో 20 నుంచి 50 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు అవిశ్రాంతంగా పని చేయాలని కోరారు. బ్లాక్ మెయిల్ రాజకీయాలకు భయపడేది లేదని ఎర్రబెల్లి స్పష్టం చేశారు. సమీక్షలో బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి గోపాల్‌రావు, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు గుంషావళి, వైస్ ఎంపీపీ తంపుల మోహన్, సొసైటీ వైస్ చైర్మన్ చందర్‌రావు, ఎంపీటీసీ బోయినపల్లి సోమేశ్వర్‌రావు, నాయకులు కట్కూరి రాజు, బరిగెల సదానందం, మాజీ సర్పంచ్ దేవేందర్, నాయకులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

మృతుల కుటుంబాలను ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించారు. మండలకేంద్రానికి చెందిన కాటబోయిన వెంకటనర్సు అనారోగ్యంతో మృతి చెందగా, మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదే విధంగా మండలకేంద్రానికి చెందిన శంకపెల్లి వెంకటాద్రి, పోశాల శ్రీనివాస్ ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు ఖాయం

మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చల్లా

పరకాల, ఏప్రిల్ 25 : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. నడికూడ మండలం రామకృష్ణాపురం, కంఠాత్మకూర్, ధర్మారం, కౌకొండ, సర్వాపురం, వెంకటేశ్వర్లపల్లి, నార్లాపూర్, చర్లపల్లి, ముస్త్యాలపల్లి, చౌటుపర్తి గ్రామాల్లో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పాలనను గాలికి వదిలేసిన రేవంత్‌కు రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చె ప్పేందుకు సిద్ధమయ్యారన్నారు. మోసానికి మారుపేరుగా నిలుస్తున్న కడియం ఓటమి ఖాయమని, బీఆర్ఎస్ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి సుధీర్ కుమార్ గెలుపునకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీతో రాష్ట్రానికి ఒరిగేది ఏమీలేదని, బీఆర్ఎస్ గెలిస్తేనే తెలంగాణవాదం నిలుస్తుందన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం

నర్సంపేట రూరల్, ఏప్రిల్ 25: నర్సంపేట పీఏసీఎస్ చైర్మన్‌గా మహేశ్వరం గ్రామానికి చెందిన బొబ్బాల రమణారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పీఏసీఎస్ చైర్మన్‌పై గత మార్చి 12న పలువురు సొసైటీ డైరెక్టర్లు అవిశ్వాస తీర్మానం పెట్టిన విషయం తెలిసిందే. గత చైర్మన్ మురాల మోహన్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించడంతో వాయిదా వేశారు. ఈ నెల 21న కోర్టు మోహన్‌రెడ్డి పిటిషన్‌ను రద్దు చేసి వైస్ చైర్మన్ అయిన మేరుగు శ్రీనివాస్‌ను ఇన్‌చార్జి చైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గురువారం డీసీవో సంజీవరెడ్డి పీఏసీఎస్ కార్యాలయంలో ఎన్నిక నిర్వహించారు. 13 మంది డైరెక్టర్లకు 9 మంది చైర్మన్ ఎన్నికలో పాల్గొన్నారు. పోటీ లేకపోవడంతో రమణారెడ్డిని చైర్మన్‌గా డీసీవో ప్రకటించారు.

నాలుగు కుటుంబాల్లో విషాదం

- ఘటనా స్థలంలోనే ముగ్గురు మృతి
- చికిత్స కోసం తరలిస్తుండగా మరో యువకుడు మృత్యువాత
- ఇల్లందలో విషాదఛాయలు

మల్లెపాక సిద్ధు

వరుణ్



పొన్నం గణేశ్

పీ రనీల్‌కుమార్

వర్ధన్నపేట, ఏప్రిల్ 25 : వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై ఇల్లంద శివారులోని ఆకేరు బ్రిడ్జి సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం నాలుగు కుటుంబాల్లో విషాదం నింపింది. ఘటనా స్థలంలోనే ముగ్గురు యువకులు మృతి చెందగా, చికిత్స కోసం తరలిస్తుండగా మరో యువకుడు తుదిశ్వాస విడిచాడు. ఈ మేరకు ఘటనా స్థలాన్ని గురువారం వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ సీతారామ్ స్థానిక పోలీసు అధికారులతో కలిసి పరిశీలించారు. వివరాల్లోకి వెళ్తే.. ఇంటర్ పరీక్షలు పూర్తి కావడంతో నలుగురు మిత్రులు బుధవారం ఇల్లందలో మరో స్నేహితుడి ఇంటి వద్ద కలుసుకొని సంతోషంగా గడిపారు. రాత్రి ఈ నలుగురిలో వర్ధన్నపేట ఫిరంగిగడ్డకు చెందిన పొన్నం గణేశ్(18)ను ఇంటి వద్ద దింపేందుకు బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో ప్రైవేట్ బస్సు ఎదురుగా ఢీకొట్టింది. దీంతో ఇల్లంద గ్రామానికి చెందిన మల్లెపాక సిద్ధు(18), పొన్నాల రనీల్‌కుమార్ (18), కాశిమర్ల వరుణ్(19) అక్కడికక్కడే మృతి చెందారు. పొన్నం గణేశ్‌ను వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలిస్తుండగా, మార్గ మధ్యంలో మృతి చెందాడు. నలుగురు యువకుల మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాలను వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించగా, బాధిత కుటుంబ సభ్యులు, ప్రముఖులు, స్నేహితులు పెద్దసంఖ్యలో వరంగల్‌కు తరలివెళ్లారు. ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు మృతి చెందడంతో స్థానికులు, కుటుంబ సభ్యులు విలపిస్తున్నారు.

ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న డీసీపీ సీతారామ్

ప్రమాద స్థలాన్ని పరిశీలించిన డీసీపీ

ఘటనా స్థలాన్ని గురువారం వరంగల్ వెస్ట్‌జోన్ డీసీపీ సీతారామ్ ఏసీపీ నర్సయ్య, సీఐ సూర్యప్రకాశ్‌తో కలిసి పరిశీలించారు. ప్రమాద తీరును ఎస్సై ప్రవీణ్‌కుమార్ డీసీపీకి వివరించారు. అలాగే, ప్రమాదానికి గల కారణాలను ఆయన సమగ్రంగా తెలుసుకున్నారు. ప్రత్యక్ష సాక్షులతో కూడా డీసీపీ మాట్లాడారు. పీ రనీల్‌కుమార్ తండ్రి కుమారస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మేయర్‌పై అవిశ్వాస తీర్మానం పెడుతాం

- దొడ్డిదారిన కాంగ్రెస్‌లో చేరిన సుధారాణి
- ఆమె రాకను వ్యతిరేకిస్తున్న కార్పొరేటర్లు
- అవినీతిలో కురుకుపోయిన మేయర్
- 20వ డివిజన్ కార్పొరేటర్ నరేంద్రకుమార్

మాట్లాడుతున్న కార్పొరేటర్ నరేంద్రకుమార్

కాశీబుగ్గ, ఏప్రిల్ 25: వరంగల్ మేయర్ గుండు సుధారాణి పదవీ వ్యామోహం కోసమే కాంగ్రెస్ పార్టీలో దొడ్డిదారిన చేరిందని, ఆమెపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడుతామని 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్ అన్నారు. గురువారం సాయంత్రం రాంకీలోని కార్పొరేటర్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మేయర్ రాకను కార్పొరేటర్లు వ్యతిరేకిస్తున్నారని ఆరోపించారు. సుధారాణి గ్రేటర్ కార్పొరేషన్‌లో అంతులేని అవినీతిలో కురుకుపోయిందని, బీఆర్ఎస్ వారే మేయర్‌ను వెలివేసినట్లు విమర్శించారు. అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి అవిశ్వాస తీర్మానం ఏర్పాటు చేస్తే బీఆర్ఎస్ కార్పొరేటర్లు కూడా తనకే మద్దతు పలికే అవకాశం ఉందన్నారు. ఆమె క్యాడర్ లేని లీడర్ అని, మేయర్ స్థాయి నాయకురాలు ఒంటరిగా కాంగ్రెస్‌లో చేరడంతోనే ఆమె రాజకీయ పలుకుబడి అర్థమైందని ఎద్దేవా చేశారు. మేయర్ పద విని కాపాడుకొని అధికారం అనుభవించేందుకే పార్టీలో చేరిందని విమర్శించారు. గ్రేటర్‌లో సుమారు 31 మంది కార్పొరేటర్లు, ఐదుగురు కోఆప్షన్ సభ్యులు పూర్తిస్థాయిలో సుధారాణిని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో కార్పొరేటర్లు చింతాకుల అనిల్, వస్కుల బాబు, ఓని స్వర్ణలత, కావటి కవిత, బాల్నె సురేశ్, పుర్కాన్, పోషాల పద్మ, సురేశ్‌కుమార్ జోషి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మేయర్ గుండు సుధారాణి

వరంగల్: మేయర్ గుండు సుధారాణి కాంగ్రెస్ పార్టీలో చేరారు. గురువారం హైదరాబాద్ గాంధీభవన్‌లో కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అయితే కాంగ్రెస్‌లో ఆమె చేరికను జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్లు తీవ్రంగా వ్యతిరేకించినట్లు సమాచారం. ఈ కార్యక్రమానికి జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకులు హాజరు కాకపోవడం గమనార్హం.

సుధారాణి సస్పెన్షన్‌కు బీఆర్ఎస్ నిర్ణయం

విషయం తెలియగానే కాంగ్రెస్ గూటికి..

కాశీబుగ్గ, ఏప్రిల్ 25: వరంగల్ మేయర్ గుండు సుధారాణిని బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయాలని బుధవారం రాత్రి నిర్వహించిన వరంగల్ తూర్పు ముఖ్య నాయకుల సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశానికి వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, పార్టీ తూర్పు ఇన్‌చార్జి పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, పలువురు కార్పొరేట ర్లు, ముఖ్య నాయకులు హాజరయ్యారు. ఇటీవల జిల్లాలో మాజీ మంత్రి కేటీఆర్ నిర్వహించిన సభకు ఆమె హాజరు కాలేదు. పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటుండడంతో పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించినట్లు తెలిసింది. ఈ విషయం తెలిసిన వెంటనే ఆమె హైదరాబాద్‌లోని కాంగ్రెస్ భవన్‌కు వెళ్లి హస్తం పార్టీ కండువా కప్పుకున్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన బస్సు

డివైడర్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

ఆత్మకూరు, ఏప్రిల్ 25 : కటాక్షపురం చెక్ పోస్టు వద్ద గురువారం రాత్రి బస్సు అదుపు తప్పి డివైడర్‌కు ఢీ కొట్టింది. దీంతో బస్సులోని దాదాపు 70 మంది ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. బస్సు హనుమకొండ నుంచి ములుగు వెళ్తుతుండగా కటాక్షపురం చెక్ పోస్టు వద్ద బస్సు అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టడంతో ప్రయాణికులు కేకలు వేశారు. సీఐ క్రాంతికుమార్ ఘటనా స్థలానికి చేరుకుని ప్రయాణికులను మరో బస్సులో ఎక్కించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న దామోదర్

అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోవాలి

నయీంనగర్, ఏప్రిల్ 25 : అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోవాలని దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడు డాక్టర్ పల్లెపాడు దామోదర్ కోరారు. జీవ వైవిధ్యానికి ప్రత్యేకత, మానవ జీవితానికి అత్యవసర ఖనిజాల ఉత్పత్తి కేంద్రాలైన గుట్టల పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరుతూ గురువారం హైదరాబాద్‌లోని వాతావరణ కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో సీనియర్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ జవహర్ సీనియర్‌కు వినతిపత్రం అందజేశారు. వరంగల్, కరీంనగర్, కేసముద్రం, రంగారెడ్డి, వికారాబాద్‌లో అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. సాంబరాజు, చక్రపాణి, వీరస్వామి ఉన్నారు.

'బీజేపీని ఓడించిదేశాన్ని రక్షించండి'

హనుమకొండ, ఏప్రిల్ 25 : మతతత్వ బీజేపీని ఓడించి దేశాన్ని రక్షించాలని సదస్సులో వక్తలు పిలుపునిచ్చారు. గురువారం నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో రాజ్యాంగ పరిరక్షణ జాక్ కన్వీనర్ వెంగల్‌రెడ్డి అధ్యక్షతన 'ప్రజాస్వామ్య పరిరక్షణ - పౌర సమాజ బాధ్యతలు' అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సదస్సులో భారత్ బచావో జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎంఎఫ్ గోపీనాథ్, ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, న్యాయవాది కిరణ్ కుమార్, ఐఎఫ్‌టీయూ జాతీయ నాయకుడు ప్రసాద్, సామాజిక విశ్లేషకుడు సీఎస్ఆర్ ప్రసాద్, రైతు స్వరాజ్య వేదిక నాయకుడు రవి మాట్లాడారు. నోట్ల రద్దు, ప్రైవేటీకరణతో ఉన్న ఉద్యోగాల్లో 12 కోట్ల ఉద్యోగాలను పోగొట్టారని, పదేండ్ల బీజేపీ పాలనలో ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఆర్థిక అసమానతలు పెరిగిపోయాయన్నారు. ఒకే దేశం, ఒకే సంస్కృతి అని మాట్లాడుతున్న బీజేపీని ఎదిరించాలన్నారు. సమసమాజ స్థాపన కోసం కృషి చేయాలన్నారు. కాజీపేట దర్గా పీఠాధిపతి కుస్రు పాషా, వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముదుసర్, ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్, లాల్ నీల్ మైత్రి వేదిక రాష్ట్ర నాయకుడుర్ మార్క శంకర్ నారాయణ, తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర నాయకులు రమాదేవి, న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకుడు అప్పారావు, భారత్ బచావో నాయకులు జైసింగ్ రాథోడ్, ఎండీ రాజ్ మహ్మద్, ఓంబ్రహ్మం, శ్రీమన్నారాయణ, డీటీఎఫ్ నాయకుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

కారు-బైక్ ఢీ.. ఒకరికి గాయాలు

దామెర, ఏప్రిల్ 25 : మండలంలోని ఒగ్లాపూర్ వద్ద కారు బైక్ ఢీకొన్న ఘటన గురువారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం శాయంపేట మండలం వసంతాపురం గ్రామానికి చెందిన తాటికంటి శశికుమార్ (25) హనుమకొండకు బైక్‌పై వెళ్తూ ఒగ్లాపూర్ వద్ద ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టాడు. శశికుమార్ తీవ్రంగా గాయపడగా చికిత్స కోసం వరంగల్‌కు తరలించారు.

సుమతిరెడ్డిలో శ్రీథమ్-2024 వేడుకలు

హసన్‌పర్తి, ఏప్రిల్ 25: విద్యార్థులు పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ ఎనగందుల వరదారెడ్డి అన్నారు. అనంతసాగర్‌లోని సుమతిరెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో శ్రీథమ్-2024 వేడుకలు గురువారం ప్రారంభమయ్యాయి. మొదటిరోజు సంప్రదాయ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని వరదారెడ్డి అన్నారు. అనంతరం విద్యార్థినులు దేశంలోని వివిధ సంప్రదాయ దుస్తులు ధరించి నృత్యాలు, పాటలు, ముగ్గులు, పతంగులు ఎగురవేసి సందడి చేశారు. ప్రిన్సిపాల్ రాజశ్రీరెడ్డి, డాక్టర్లు మహేందర్, సుదర్శన్, శ్రీవాణి, ఏవో వేణుగోపాలస్వామి పాల్గొన్నారు.



విద్యార్థినులతో కలిసి నృత్యం చేస్తున్న ప్రిన్సిపాల్ రాజశ్రీరెడ్డి

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ అరుణ

ఇంటర్ ఫలితాల్లో ఎల్బీ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 25 : లాల్‌బహదూర్ కాలేజీ విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ అరుణ తెలిపారు. ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు ముప్పిడి ఆశ్రిత 452, అల్లి హిమనిధి 436, బీపీసీ విభాగంలో అభిగ్నబంధు 427, మసూన్‌అలీ 402, కుసుమ పృథ్వీ 395 మార్కులు, సీఈసీ విభాగంలో 500 మార్కులకు కోట భాగ్యలక్ష్మి 477, ఆసియాబేగం 443, శ్రావణి 437, అక్బర్ 406 మార్కులు, పిన్న సాహిత్య 403 మార్కులు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాజేందర్‌రెడ్డి, ఇంటర్ కో ఆర్డినేటర్ ముంద్రాతి సదానందం పాల్గొన్నారు.

డిప్లొమా కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

పోచమ్మమైదాన్, ఏప్రిల్ 25: ఒడిశా రాష్ట్రంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ డిప్లొమా కోర్సుకు వరంగల్ జిల్లాలోని యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వరంగల్ చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకుడు జి.రాఘవరావు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అభ్యర్థులకు 9 సీట్లు కేటాయించారని, ఇందులో ఒక సీటును ఈడబ్ల్యూఎస్ కేటగిరీకి రిజర్వ్ చేశారని, ఈ కోర్సు మూడేళ్లు ఉంటుందని పేర్కొన్నారు. పదో తరగతి పాస్ లేదా తత్సమానమైన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలని, బీసీ, జనరల్ కేటగిరీ అభ్యర్థులు 2024 జూలై 16 నాటికి 15 నుంచి 23 ఏళ్లలోపు వయస్సు కలిగి ఉండాలని, షెడ్యూల్ కులాలు/షెడ్యూల్ తెగల వారు 15 నుంచి 25 ఏళ్లలోపు ఉండాలని వివరించారు. ఆసక్తిగలవారు The Principal SPKM Indian institute of Handloom Technology Veenkatagiri-524132 చిరునామాకు జూన్ 10వ తేదీలోగా దరఖాస్తు పంపాలని సూచించారు.

ఐటీఐలో వస్తువుల కొనుగోళ్లకు టెండర్లు..

పోచమ్మమైదాన్, ఏప్రిల్ 25 : ములుగు రోడ్డులోని బాలికల పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లోని ఐవోటీస్మార్ట్ అగ్రికల్చర్ టెక్నీషియన్, డ్రోన్ టెక్నీషియన్ కోర్సుల్లో టూల్స్, ఎక్విప్‌మెంట్, మిషనరీ కొనుగోలు చేసేందుకు ఆన్‌లైన్ ద్వారా టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు వరంగల్ రూరల్ ప్రిన్సిపాల్ సక్కు ఒక ప్రకటనలో తెలిపారు. http://tender.telangana.gov.in ద్వారా టెండర్లు ఉంటాయని, ఈ నెల 29 ఉదయం 11వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఉద్యమకారుడు రవీందర్ మృతి తీరని లోటు

ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి

శాయంపేట, ఏప్రిల్ 25 : మండలంలోని కొప్పుల గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జలుగురి రవీందర్ మృతి తీరని లోటని మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. గురువారం రవీందర్ కుటుంబ సభ్యులను సిరికొండ పరామర్శించి రవీందర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. బీఆర్ఎస్ మాజీ మండలాధ్యక్షుడు గుర్రం రవీందర్, పీఏసీఎస్ డైరెక్టర్ బగ్గి రమేశ్, సిరికొండ యువసేన జిల్లా నాయకుడు బేరుగు రాకేశ్, ఉద్యమ నాయకులు నిమ్మల మహేందర్, సారయ్య, సుదర్శన్ తదితరులు ఉన్నారు.

'హక్కులను కాలరాస్తున్న పాలకులు'

నర్సంపేట, ఏప్రిల్ 25 : పాలకులు కార్మిక వర్గ హక్కులను కాలరాస్తున్నారని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు అన్నారు. నర్సంపేట వ్యవసాయ మార్కెట్ ఆవరణలో గురువారం హమాలీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల చట్టాలను కేంద్రం కార్పొరేట్ శక్తులతో మిలాకత్ అయి మార్చివేస్తున్నదని విమర్శించారు. వీటికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. 8 గంటల పని విధానం అమలు చేయాలన్నారు. కార్మిక సంఘం నాయకులు ప్రసాద్, రాములు, భిక్షపతి, అనిల్, చంద్రమౌళి, కుమార్ పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌లో సైనిక్‌స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ఖానాపురం, ఏప్రిల్ 25 : అశోక్‌నగర్‌లోని గిరిజన సంక్షేమ సైనిక్ స్కూల్‌కు చెందిన 19 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు గురువారం తెలిపారు. పాఠశాలకు చెందిన 40 మంది పరీక్ష రాయగా, 19 మంది జేఈఈ అడ్వాన్స్‌కు ఎంపికైనట్లు చెప్పారు. విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు.

'ఇన్‌స్ట్రక్టర్లను విధుల్లోకి తీసుకోవాలి'

శాయంపేట ఏప్రిల్ 25 : సమగ్ర శిక్ష అభియాన్‌లో ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లను టర్మినేషన్ విధానం ఎత్తివేసి వెంటనే విధుల్లోకి తీసుకోవాలని పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్ల అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు తంగళ్ల వెంకటేశ్వర్లు కోరారు. శాయంపేటలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2012 నుంచి పాఠశాలలో ఆర్ట్, క్రాఫ్ట్, ఈఈటీ, మ్యూజిక్ ఇన్‌స్ట్రక్టర్లుగా చాలీచాలని జీతంతో పని చేస్తున్నారన్నారు. ప్రతి సంవత్సరం విద్యా సంవత్సరం చివరలో వీరిని టర్మినేట్ చేస్తూ మళ్లీ బడులు ప్రారంభమయ్యాక అధికారుల చుట్టూ తిరిగితే గాని విధుల్లోకి తీసుకునే పరిస్థితి ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి చొరవ చూపి వీరిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మొగిలి, నజీర్ ఉన్నారు.

నర్సింగ్ ఆఫీసర్లకు ఐడీల పంపిణీ

పోచమ్మమైదాన్, ఏప్రిల్ 25: వరంగల్ ఎంజీఎం దవాఖానలో నూతనంగా నియామకమైన నర్సింగ్ ఆఫీసర్లకు ఎంప్లాయిస్ ఐడీలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చాంబర్‌లో జరిగిన సమావేశంలో సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ నూతనంగా విధుల్లో చేరిన నర్సింగ్ ఆఫీసర్లు అంకితభావంతో రోగులకు సేవలు అందించాలని సూచించారు. ఆర్ఎంవోలు డాక్టర్ అంబి శ్రీనివాస్, డాక్టర్ ఏ ప్రసాద్, డాక్టర్ అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ట్రాలీ ఢీకొని వృద్ధురాలి మృతి

భీమదేవరపల్లి, ఏప్రిల్ 25 : ట్రాక్టర్ ట్రాలీ ఢీకొని వృద్ధురాలు పోలు చంద్రమ్మ (91) మృతి చెందిన ఘటన భీమదేవరపల్లిలో జరిగింది. భీమదేవరపల్లి గ్రామానికి చెందిన చంద్రమ్మ పింఛన్ తీసుకునేందుకు మంగళవారం కస్టమర్ సర్వీస్ పాయింట్‌కు వెళ్లింది. డబ్బులు తీసుకొని ఇంటికి వెళ్తుండగా, వాటర్ ట్యాంక్ వద్ద సాత్రబోయిన రాజేశ్ నిర్లక్ష్యంగా ట్రాక్టర్‌ను రివర్స్ తీయడంతో ట్రాలీ తగిలి చంద్రమ్మకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఆమెను హనుమకొండలోని ప్రైవేట్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. కొడుకు నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయిబాబు తెలిపారు.

డీజిల్ లోకో షెడ్‌కు బెస్ట్ మెయింటనెన్స్ అవార్డు

కాజీపేట, ఏప్రిల్ 25 : ఎలక్ట్రికల్ లోకోల నిర్వాహణలో షెడ్ కార్మికుల సమష్టి కృషి (ప్రతిభ) ఫలితంగా రైల్వే బోర్డు కాజీపేట డీజిల్ లోకో షెడ్‌కు బెస్ట్ మెయింటనెన్స్ అవార్డు ఇచ్చిందని షెడ్ సీనియర్ డీఎంఈ స్వరాజ్‌కుమార్ అన్నారు. అవార్డును సికింద్రాబాద్ రైల్వే జీఎం కార్యాలయంలో జీఎం ఏకే జైన్ చేతుల మీదుగా అందుకున్నారు. స్వరాజ్ కుమార్‌కు గురువారం కార్మికులు ఘన స్వాగతం పలికి, ర్యాలీ నిర్వహించారు. షెడ్ డీఎంఈ అనికేత్, ఎస్ఎంఎం అతుల్ ద్వివేది, ఏఎస్ఎంటీ రవీంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తొర్రూరు సభకు తరలిన గులాబీ శ్రేణులు

రాయపర్తి, ఏప్రిల్ 25: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మహబూబాబాద్ జిల్లా తొర్రూరు రెవెన్యూ డివిజన్‌కేంద్రంలో గురువారం నిర్వహించిన బీఆర్ఎస్ పాలకుర్తి నియోజకవర్గ స్థాయి సదస్సుకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి గులాబీ శ్రేణులు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు హాజరైన నేపథ్యంలో కార్యకర్తలు ఉత్సాహంగా తరలివెళ్లారు.